# నేనూ: ఎస్. ఆర్. సి. రిపోర్టూ

జి. యస్. వి. ఆచార్య

నిజం. అక్షరాలా నిజం. యస్. ఆర్. సి. చాలా మందికి అన్యాయం కల్గించిందని అన్నారు. అది ఎంత వరకు నిజమో నాకు తెలియదు. కాని యస్. ఆర్. సి. నాకు అన్యాయం చేసిన మాట మాత్రం నిజం.

నివేదిక ప్రచురణ తర్వాత ఎందరో ఎన్నో ఆరోపణలు చేశారు. ఒకసారి పరిష్కరింపబడి అంతటితో ముగిసిన బళ్ళారి సమస్యను మళ్ళీ లేవనెత్తి, యస్. ఆర్. సి. బళ్ళారి వాస్తవ్యులకు అన్యాయం చేసిందన్నారు. బొంబాయి రాష్ట్రాన్ని ద్విభాషా రాష్ట్రంగా ఉంచాలనే సిఫార్సు చేసి మహారాష్ట్రులకు ద్రోహం చేసిందన్నారు. తమకో ప్రత్యేక రాష్ట్రం కావాలనే సిక్కుల చిరకాల వాంఛను నిరాకరించి వారికి ఘోరమైన అపకారం చేసిందన్నారు. తెలంగాణాను తక్షణమే ఆంధ్రతో చేర్చి విశాలాంధ్ర నిర్మించాలని సిఫార్సు చేయక, తెలంగాణా వారిని స్వార్థపరులుగా మార్చి ఆంధ్రకు అన్యాయం చేసిందన్నారు. అయితే ఇన్ని ఆరోపణల మధ్య కొందరు యస్. ఆర్. సి. కి ధన్యవాదాలు అర్పించక పోలేదు. తెలంగాణా ప్రజల కోర్కెను గమనించి, ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నిర్మాణానికి సిఫార్సు చేసి, తెలంగాణ భవిష్యత్తు ఆ ప్రాంత వాస్తవ్యుల చేతుల్లోనే ఉంచిన కమీషనుని, ప్రత్యేక తెలంగాణావాదులు, నిజమైన ప్రజాస్వామ్య సంస్థయని వేనోళ్ళ కొనియాడారు.

ఆ రోజుల్లో నేను ఫోర్తు ఇయరులో ఉన్నాను. సారస్వత సమితి తరఫున ఏర్పరచ నిశ్చయించిన "డిబేట్కు"కి సబ్జక్టు విచారిస్తున్నాము. ఒక మిత్రుడు 'విశాలాంధ్రమా లేక తెలగాణమా' అను శీర్షిక పెట్టండన్నాడు. నా జ్ఞాపకశక్తి చెడకపోతే, ఆ రోజు మా మిత్రులందరూ అతన్ని నానామాటలు అన్నట్లు జ్ఞాపకం. అసలు నీ బుఱ్ఱలోకి అలాంటి ఆలోచనెట్లా వచ్చింది? అది కలలోగూడ ఊహించగూడని విషయం అనిగూడా అన్నారనుకుంటాను. అంతటితో ఆ చర్చ అప్పటికి ముగిసింది.

కొద్దిరోజుల తర్వాత హైద్రాబాద్ మంత్రి ఒకరు ప్రత్యేక తెలంగాణ ఏర్పడే అవకాశాలు లేకపోలేదని ఒక ఉపన్యాస మిచ్చారు. దాంతో ప్రత్యేక తెలంగాణ అనునది ఊహించరాని విషయం కాదని, వీలైతే ప్రత్యేక రాష్ట్రం రావచ్చునని కొంత ప్రచారం కల్గింది. అక్టోబరున ఆంధ్రరాష్ట్రం ఏర్పడడంతో ప్రత్యేకరాష్ట్రవాదం గూడా కొద్దిగా బలం చేకూర్చుకుంది. ఇంతలో విశాలాంధ్ర మహాసభ ఏర్పడింది. ఆ సభ ప్రథమ సమావేశము హైద్రాబాదులో జరిగినా దానిలో హైద్రాబాద్ వాస్తవ్యుల, ప్రత్యేకించి రాజకీయ నాయకుల, సంఖ్య చాల స్వల్పము. అందువలన విశాలాంధ్ర తెలంగాణవారి సమస్య కాదు ఆంధ్రరాష్ట్రం వారి అవసరము అను భావము కలుగకపోలేదు. ఎలాగైతే నేమి ప్రత్యేకరాష్ట్ర వాదానికి బలం చేకూరింది. తుదకు యస్. ఆర్. సి. గూడా దానికి చెవి ఒగ్గక తప్పలేదు.

కాని ముఖ్యమంత్రుల ఢిల్లీ సమావేశానికి హాజరయి వచ్చిన హైదరాబాద్ ముఖ్యమంత్రి పత్రికా ప్రసంగం ప్రత్యేకరాష్ట్రవాదుల్లో భయోత్పాతం కలిగించింది. వారు తమ ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. ప్రజలను, ప్రత్యేకించి విద్యార్థులను తమ కనుకూలంగా త్రిప్పుకో ప్రయత్నించారు. చాలా వరకు సఫలులయారు. అయితే విద్యార్థులలో విశాలాంధ్రవాదులు లేరనలేము. చాలామంది ఉన్నారు. కాని వారు బయటకు పొక్కరు. మీరు రహస్యంగా ఉంచుతానంటే చెప్తాను. నేనూ వారిలో ఒక్కడిని. అవసరమైనపుడల్లా పత్రికలద్వారా మా కోరికను తెలుపుతూనేవచ్చాం. కాని ఒక్క విషయం. పదిమంది పాడినగీతంకంటే నల్గురు చేసిన అల్లరి ఎక్కువ దూరం వినపడుతుంది.

కాంగ్రెసు వర్కింగ్ కమిటీ తీర్మానం—కాదు, సలహా—తర్వాత నిరసనగా విద్యార్థులంతా సమ్మె

చేశారు. మామూలు ప్రకారం నేను ఆరోజు ట్యూషను చెప్పడానికి వెళ్ళాను. కుర్రాళ్ళ తండ్రి అక్కడే కూర్చొని ఉన్నాడు. నమస్కారాలతో ప్రారంభమైన మా సంభాషణ అతి సహజంగా విశాలాంధ్రసమస్యకు మరలినది: మీఅభిప్రాయమేమిటని అడిగాడు ఆయన.

"ఆఁ. అయ్యేదేదో అవుతుంది. అనవసరంగా మనం బుర్ర పాడుచేసుకోవటం దేనికి?" అన్నాను తప్పించుకునే ప్రయత్నంతో.

"అహా. అదికాదు ఈరోజు విద్యార్థులంతా స్ట్రయికు చేశారటగా?" అన్నాడు.

"అవును. చేశారు. చేస్తేమాత్రం ఏం లాభం? ఇంతకుపూర్వం ఓసారి ముల్కీ నాన్‌ముల్కీ ఎజిటేషను అప్పుడు ఇలానేచేశారు. పోలీసులు కాల్పులు జరిపారు. ముగ్గురు బలికావటంతో ముగిసింది కథ. రాష్ట్రేతరులంతా వెళ్ళిపోయారా?"అన్నాను నేను.

"తెలంగాణ వస్తే వెళ్ళిపోతారు" అన్నాడు.

'అది వచ్చేనమ్మకమేమి?' టన్నాను.

"ప్రజలంతా కావాలన్నప్పుడు రాక ఏమవుతుంది. ప్రజలకోరికను అంత చులకనగా తీసివేయటానికి వీలుందా? నూటికి 90 మంది ప్రత్యేకరాష్ట్రం కావాలంటున్నారు. విద్యార్థులంతా అదే కోరుతున్నారు." అన్నాడు ఆయన.

"ఏమో! హర్తాళ్ చేసినంత మాత్రాన అంతా తెలంగాణ కావాలంటున్నారనే నమ్మకమేమిటి? ఈరోజు మా కాలేజిలో హర్తాళ్ జరిగింది. ఒక విద్యార్థిని ఎందుకయ్యా హర్తాళ్ అని నే నడుగుతే 'విశాలాంధ్ర' విషయమై అన్నాడు. అంటే కావాలనా లేక వద్దనా? అని మళ్ళీ ప్రశ్నిస్తే, అదే తెలియటంలేదు అన్నాడు. 'ఏమిటయ్యా ఇక్కడే ఉండి తెలియదంటావేమి? ఎవరినడిగినా తెలుస్తుందే అన్నాను. అంటే కొందరు కావాలంటున్నారు, కొందరు వద్దంటున్నారు అన్నాడు. నిజంగా చూస్తే పరిస్థితి అలాగే ఉంది. అలాటప్పుడు హర్తాళ్ చేసిన విద్యార్థులంతా తెలంగాణ కావాలంటున్నారనుకోవటం పొరపాటు. హర్తాళ్ చెయ్యటానికి ఎన్నో కారణాలుంటాయి. నల్గురు విద్యార్థులు కలిసి పూర్తి కాలేజీని బయటకు తీసుకురాగలరు. ఉదాహరణకు నేనే ఉన్నాను. నేను విశాలాంధ్రవాదిని. కాని ఈ రోజు నేను కూడ క్లాసు అటెండు అవలేదు.' అన్నాను నాలుకజారి.

"అయితే మీరు విశాలాంధ్ర కావాలని ఎందుకంటారు?"అని నామీదకు మళ్ళించాడు ప్రశ్నను.

వ్యక్తిగతంగా పరిణమించిన చర్చలో పాల్గొనదలచక 'అవన్నీ ఇప్పుడెందుకు లెండి.' అన్నాను.

"కాదండీ, మనం వెనుకబడి ఉన్నాం. విశాలాంధ్ర వస్తే ఆంధ్రులు మనల్ని పీక్కుతింటారు. ప్రతేక్యరాష్ట్రముంటే మనం మనల్ని బాగు పరచుకోవచ్చు." అన్నాడు.

"కావచ్చు. కాని తెలంగాణ ఆర్థికంగా స్వయం సమృద్ధి కాజాలదని ఎకనమిక్సు, స్టాటిస్టిక్సు బ్యూరోవారు కూడా తేల్చినారు. పైగా ఈ నాయకులు కేవలం పదవీవ్యామోహం కలవారై ప్రత్యేక రాష్ట్రం కోరటంలేదనడానికి నిదర్శనమేమి? వారు అభివృద్ధి కార్యక్రమాన్ని సాగిస్తారనే నమ్మకమేమి? ప్రత్యేక రాష్ట్రం కావాలనటం ఎలాగూ సమంజసంకాదు. ప్రజలు కోరినంత మాత్రాన మన్నించాలనిలేదు. రేపు మా జిల్లావారంతా కలిసి ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలంటారు. ఇస్తారా? అదెట్లా కాజాలదో, ఇదీ అట్లే. పదవీమోహం కొందర్ని అలా ఆడిస్తోంది. 'వాళ్లు మనకన్నా ఎక్కువ చదువుకున్నవాళ్లు గనుక మీకు ఉద్యోగాలు దొరకవు. వాళ్ళు పంట ఎక్కువ పండించగలరు కనుక మీ భూములను ప్రభుత్వం వారి కిచ్చేస్తుంది,' అని దుష్ప్రచారంచేసి అధికసంఖ్య ప్రత్యేకరాష్ట్రం కోరుతుంది అంటున్నారు. అది నిజమే. అయితే ఈ అధికసంఖ్యకు ఎంత విలువ ఇవ్వాలో మీరే ఆలోచించడి...సరే. అనవసరంగా మనం వాదనలోకిదిగాము. పిల్లల్ని పిలవండి"అన్నాను ట్యూషను ముగించి బయటపడ్డాను.

మర్నాడు మామూలుగా ట్యూషను ముగించి నా సైకిలు తీసుకుంటున్నాను. పెద్ద పిల్లవాడు వచ్చాడు'సార్! ట్యూషను వద్దన్నారు' అన్నాడు రెండు పదిరూపాయల కాగితాలు నా చేతిలో పెడుతూ. 'అయితే రేపటినుండి రావద్దా?' అని అడిగాను.

'వద్దు' అన్నాడు.

ఇది యస్. ఆర్. సి.నాకు చేసినఅన్యాయం కాదంటారా?

★

భారత కావ్యాలలోని కథలు, సామాజిక, పారివారిక జీవితాదర్శముల నుపదేశించి వాటియాదర్శ పథాన్ని గురించి బోధించుటయేగాక నీతి ధర్మోపదేశములకు స్థావరమై ధర్మప్రచారానికి దోహదమొసంగుచున్నవి. కనుకనే భాసుడు, కాళిదాసు మొదలైన గొప్పకవులు కూడా పైకావ్యాలనుండి తమతమ కథాసామగ్రిని స్వీకరించుటకు వెనుదీయలేదు. పైశాచీ భాషలో లిఖించబడిన బృహత్కథ. ప్రాచీన కథా సాహిత్యానికి మణిపూసవంటిది. విభిన్న భారతీయ భాషలలో ప్రచారములోనున్న కథల, ఆఖ్యాయికలను సంస్కృత భాషలో రచించబడిన కథా సంగ్రహమే బృహత్కథ. దీని తరువాతనే పంచతంత్రం, హితోపదేశం మొదలైన నీతి ప్రధానమైన కథల రచన జరిగినది. వీని యందు పశుపక్ష్యాదులను పాత్రల రూపముగా చిత్రించి వాటిద్వారా ఉపదేశ ప్రదమైన వ్యావహారిక నీతియుక్తమైన పెక్కు కథలు రచించబడినది. ఈ విధముగా భారతీయ కథాసాహిత్యము యెక్కువ సమృద్ధ మవగల్గినది. ఇందు హిందీ కథా సాహిత్యమొకటి. హిందీ కథా సాహిత్య వికాస కాలమును మూడు ముఖ్యభాగములుగా విభజించ వచ్చును.

## మొదటి దశ:-1900—1915

ఇది హిందీ కథా సాహిత్య వికాసానికి తొలి దశ. ఇట్టి దశలో హిందీ సాహిత్యమునకు కథా సాహిత్య మొక నూతన వస్తువు. ఈనాటి కథా ప్రారంభదశలో "బైతాల పచ్చీసీ" "సింహాసన బత్తీసీ" "శుకబహోతరి" మొదలైన కథలు అనువాదముల రూపమున వెలువడినవి. కూట నీతి, మోసములతో నిండి సంఘర్ష జీవియైన మానవునిలో సాహసోత్తేజముల జనింప జేయుటయే వీని ప్రధాన లక్ష్యము. ఈనాటి కథా సాహిత్యముపై ఉర్దూ ప్రభావము ఎక్కువగా పడియున్నది. స్వతంత్ర రచన రూపమున వచ్చిన కథలలో ఇంశా అల్లాభా రచించిన "రానీ కేతకీ కీ కహానీ" హిందీ కథా సాహిత్యానికి తొలి బిక్ష. తరువాత రాజా శివప్రసాద్ రచించిన "రాజా భోజకాసపనా" ద్వితీయ స్వతంత్ర రచన. పిమ్మట సదల మిశ్ర రచించిన నాసికేతోపాఖ్యానము వెలువడినది. పై నుదహరించిన కథాత్రయము హిందీ కథా సాహిత్య క్షేత్రంలో తొలుతగా వెలిసిన స్వతంత్ర రచనలని నిశ్శంశయముగా చెప్పవచ్చును. మన దేశంలో ఇంగ్లీషు భాషాప్రచారం పట్టుదలగా జరిగిన తర్వాతనే వాస్తవముగా హిందీ కథా సాహిత్య వికాసారంభమైనది. ఇట్టి వికాసారంభము యిరువదవ శతాబ్దారంభమున చిన్న చిన్న ఇంగ్లీషు కథల యనుకరణ రూపాలోను, అనువాదముల రూపములోను జరిగినది. తొలుతగా మన దేశమున బెంగాల్ ప్రాంతములోనే ఇంగ్లీషు ప్రచారము తీవ్రముగా జరిగినందున పాశ్చాత్య పద్ధతిలో చిన్న కథలు వ్రాయడం బంగాల్ దేశములోనే యారంభమైనది. ఇచ్చట కథా సాహిత్యాభివృద్ధి గాంచిన పిమ్మట హిందీ రచయితల దృష్టి బంగాలీ సాహిత్యమువైపు మరలినది. సుప్రసిద్ధ హిందీరచయిత భారతేందు బాబూ, హరిశ్చంద్రుడు తన దృష్టిని చిన్నకథలపైపు మరలించి ఎన్నియో కథలు హిందీలో వ్రాసినారు. ఇండియన్ ప్రెస్‌కు సంబంధించిన శ్రీ ఘోష్‌బాబు బంగాలీనుంచి చిన్నచిన్న కథలు హిందీలోకి అనువదించెను. 1900 సంవత్సరము జనవరి నెలలో సుప్రసిద్ధ హిందీ మాసపత్రిక "సరస్వతి" వెలిసి ఆధునిక హిందీకథా సాహిత్యానికి వెన్నెముకవలె పనిచేసినది. స్వతంత్ర హిందీ కథారచన నాటి నుండియే యారంభమైనదని నిర్భయముగా చెప్ప వచ్చును. కిశోరిలాల్ గోస్వామి రచించిన ప్రథమ స్వతంత్ర రచన "ఇందుమతి" కథ 1900 సంవత్సరము జూన్ మాసమున 'సరస్వతి' పత్రిక యందు ప్రచురింపబడినది. పార్వతీ నందన్ అను వంగ మహిళ ఎన్నియో బంగాలీ కథలను హిందీ భాషలోనికి అనువదించి హిందీకథా సాహిత్యాన్ని సుసంపన్నము చేసిరి. 1911వ సంవత్సరమున "ఇందు" పత్రికలో తన తొలి స్వతంత్రరచనయైన "గ్రామ" కథను ప్రచురింపచేసి హిందీ సాహిత్య క్షేత్రములోనికి అడుగుపెట్టినాడు జయ శంకర ప్రసాద్. కౌశిక్ రచించిన "రక్షాబంధన్" కథ, గులేరీ రచించిన "సుఖమయ జీవన్" అను కథలు గిరిజాదత్త బాజపేయీ, జ్వాలాదత్త శర్మ, విశ్వంభరనాధజిజ్ఞా, విశ్వంబరనాథశర్మ, రాజా రాధికా రమణ ప్రసాద్ సింహా, చతురసేన శాస్త్రి, మొద

లైన ప్రసిద్ధులకథలు, యీ కాలములోనే పత్రికలలో ప్రచురింపబడినవి. స్వతంత్ర రచనల ఆరంభము వాస్తవముగా 1912వ సంవత్సరములో ఆరంభమైనదని చెప్పవచ్చును. గులేరీ రచించిన "బుద్ధూ కా కాంటా" విశ్వంబరనాథ్ రచించిన "పరదేశీ" మొదలైన రచనలు యీ కాలంలో స్వతంత్ర రచనల రూపములో బయలువెడలినవి. గులేరీజీ రచించిన సుప్రసిద్ధ రచన "ఉస్నేకహాథా" కథ 1915లో సరస్వతిలో ప్రచురింపబడినది. 1914 తరువాత ఎంతో మంది నూతన రచయితలకు పై రెండు పత్రికలద్వారా హిందీ సాహిత్య క్షేత్రములోనికి రాగల్గుటకుతగిన ప్రోత్సాహము లభించినది. హిందీ కథా సాహిత్యపు యీ ఆరంభదశలో స్వతంత్ర రచనలు బహుకొద్దిగను అనువదించబడిన కథలు ఎక్కువగను వెలువడినవి.

## రెండవ దశ:-1916—1936

ఈ ద్వితీయ దశలో అనేకమైన స్వతంత్ర రచనలు హిందీకథా సాహిత్యంలో అగ్రస్థానాన్ని ఆక్రమించ గల్గినవి. ఇట్టి స్వతంత్ర రచయితలలో ప్రేమచంద్‌కు లభించిన ఖ్యాతి మరి యే యితర రచయితకు లభించలేదనిన అతిశయోక్తి కానేరదు. యుగధర్మాన్ని పాటించి సాంఘిక పరిస్థితులను దృష్టియం దిడుకొని స్వతంత్రించి చిన్న చిన్న కథలు సాగించి నిద్రాణమైయున్న ప్రజానీకాన్ని ఉత్తేజపరచ గలిగినాడు ప్రేమచంద్. ఈయన 250 కథలకు తక్కువగాకుండా రచించినాడు. ఈయన నవలలు—మహాకావ్యాలన్నా తప్పు కాదేమో! పంద్రెండు వరకు గలవు. గ్రామీణ వాతావరణాన్ని, నాటి సాంఘిక కట్టుబాట్లను, ఆర్థిక పరిస్థితులను, మధ్యకుటుంబీకుల సాధకబాధకాలను నూటికి నూరుపాళ్లు సజీవంగా తన కథలలో చిత్రించ గలిగినాడు ప్రేమచంద్. ఈయన తొలి రచన "పంచపరమేశ్వర్" కథ 1916లో సరస్వతి పత్రికలో ప్రచురించబడడంతో హిందీకథా సాహిత్యపు ద్వితీయ ఘట్ట మారంభమైనదని చెప్పవచ్చును. ఇప్పటి వరకు ఉర్దూ సాహిత్యక్షేత్రంలో తనకలాన్ని ఉపయోగించి ఆకస్మాత్తుగా హిందీ సాహిత్య క్షేత్రములోనికి దుమికి తన కలానికి పదును పెట్టగలిగిన ప్రేమచంద్ యీ కథా సాహిత్యానికి చేసిన సేవ ఎంతో శ్లాఘనీయము. కథా సాహిత్య శిల్పానికి వన్నె దెచ్చి భావి రచయితలకు ఆదర్శరచయితగా "సమ్రాట్" బిరుదు పొంది హిందీకథా సాహిత్యాకాశమున ధృవ తారగా వెలుగొందుచున్నాడు ప్రేమచంద్. ఈయన కథలన్నీ "మానసరోవర్" అను పేర ఎనిమిది సంపుటములలో ప్రచురింప బడినవి. ప్రేమచంద్ తర్వాత రామకృష్ణదాస్, గోవింద వల్లభ పంత్, సుదర్శన్, పదుమలాల్ పన్నాలాల్ బక్షి, చండీప్రసాద్, శివపూజనసహాయ్, మొదలైన వారి పేర్లు గణించ వచ్చును. ఈ కాలమున గంగాప్రసాద్ శ్రీవాత్సవ హాస్యరస ప్రధానమైన కథలు రచించడములో సిద్ధహస్తుడని పేరు గాంచినాడు. ఇదే కాలంలో ప్రసాద్, బేచన శర్మా ఉగ్ర, సుదర్శన్, కౌశిక్, వాజపేయీ మొదలైనవారి కథలూ, హిందీకథాసాహిత్య వికాసానికి ఎంతయో తోడ్పడి హిందీసాహిత్యానికి మెరుగులు దిద్దగల్గినది. ప్రసాద్ కథలన్నీ భావప్రధానమైనవియూ, చరిత్రాత్మకమైనవియున్నూ. ప్రతాప నారాయణ శ్రీ వాత్సవ రచించిన "ఆశీర్వాద"మను కథ కూడా యీ కాలముననే ప్రచురింప బడినది. హిందీకథా సాహిత్య చరిత్ర ఉన్నతస్థితికి చేరి పెక్కుమంది నూతన రచయితలకు యీ తరుణమున తగిన ప్రోత్సాహమిచ్చి సాహిత్య క్షేత్రములోనికి ప్రవేశ పెట్ట గల్గినది. నూతన రచయితలలో ఈలాశ్ చంద్రజోషీ, భగవతీ చరణవర్మ, అజ్ఞేయ్, చంద్రగుప్త విద్యాలంకార్, వియోగి, ద్విజ్ బృందావన లాల్ వర్మా, ఉపేంద్రనాథ అశ్క మొదలైన వారి పేర్లు పేర్కొనవచ్చును. ఈ యుగంలో జరిగిన హిందీకథా సాహిత్యాభివృద్ధి వంటిది మరి యే సాహిత్యాంగానికి జరుగలేదనిన అతిశయోక్తి ఏమాత్రమూ కానేరదు. స్వతంత్ర రచనల కెక్కువ ప్రాధాన్యమివ్వబడినప్పటికి ఇంగ్లీషు, బెంగాలీ భాషలనుండి అనువదింపబడిన కథలుకూడా ఎక్కువ ప్రచురింపబడుతూ వుండేవి. దీనికి తోడుగా యీ కాలమున కొంగ్రొత్త పత్రికలు వెలువడడంతో నూతన రచయితలకు తగిన ప్రోత్సాహములు లభించినందున హిందీకథా సాహిత్యాభివృద్ధి పరాకాష్ఠకు చేరినదని చెప్పవచ్చును. ఈ ఘట్టమున హిందీరచయితలపై బెంగాలీ రచయితలైన

శరత్, రవీంద్రనాథ్‌ల ప్రభావము పడినది. కాని తృతీయ యుగమున వీరి ప్రభావము తగ్గి జాతిపిత గాంధీప్రభావము పడసాగినది.

**మూడవ దశ: 1937నుండి నేటివరకు**

దీనిని గాంధీయుగ మనవచ్చును. నేటి సాహిత్యమునకు మూలాధారము జాతీయత. ఈ యుగమున రచయితల దృష్టియదార్థవాదము, ఆదర్శవాదము సమాజము వైపు మరలినది. మానవునికైనందిన జీవితము అతని జీవితపు లోతుపాతుల నన్వేషించుట మొదలైన విషయాలు కథలకు ఆటపట్టులుగా నిలచినవి. మహాత్మాగాంధీ, టాల్‌స్టాయి, నెహ్రూ, గోర్కీల ప్రభావం నేటి రచయితలపై పడడంవలన వారి దృష్టికోణమునందు మార్పువచ్చినది. సంఘ సంస్కారము వీరి పరమావధిగా యుండెను. సామాన్య మానవుని జీవితచరిత్రణ నేటికథకు మూల లక్ష్యము. కనుకనే నేటికథలలో మనము మానవుని జీవిత ప్రతిబింబాన్ని చూడగల్గుచున్నాము. దీని పరిణామముగనే సాహిత్యక్షేత్రముననూ రాజకీయ క్షేత్రములో వలె ప్రగతివాదము అడుగుపెట్టి నిలబడగల్గినది. అజ్ఞానాంధకారంలోపడి అంధవిశ్వాసాలకు బానిసలై దారి తెన్నుకానలేక తటపటాయించు బాటసారివలె, లక్ష్యాన్ని మరచి పలుబాధలకు లోనైన మానవజాతికి నూతన స్ఫూర్తిని కల్పించుటయే నేటి కథాసాహిత్యపు ముఖ్యధర్మముగను పరమలక్ష్యముగను యున్నది. ప్రగతివాద యోధులలో యశపాల్, పహాడి, రాంగేయరాఘవ, అమృతరాయ్, జైనేంద్రకుమార్, బేనీపురీగార్లకు తగిన ప్రఖ్యాతి లభించినది. ప్రగతివాదయుగము 1925నుండి యారంభమైనదని చెప్పవచ్చును. ఈ యుగముననే మహిళా రచయిత్రులను కూడ మనం దర్శించవచ్చును. వారిలో సుభద్రాకుమారీ చౌహాన్, హోమవతీదేవి, కమలా చౌదరి, ఉషాదేవిమిత్రా, సత్యవతి మల్లిక్ మొదలైనవారు ప్రసిద్ధిగాంచిరి. నేటి సాహిత్యమున సహజత్వమునకే స్థానమున్నదిగాని అసహజత్వమునకుగాదు. సహజత్వమునకు దూరముగానున్న కళ కళకానేరదు. కనుకనే నేటిసాహిత్యమున కథాసాహిత్యభాగము మిక్కిలి సుసంపన్నమైయున్నది. దేశ, కాల, సంస్కృతి, పరిస్థితులలో వచ్చుమార్పులనుకూడా నేటిసాహిత్యం తనలో లీనంచేసుకొని సహజత్వానికి మూలాధారమై సమాజానికి ప్రతిబింబమువలె వెలుగొందుచున్నది. నేటి కథాసాహిత్య మెంతయో వికాసముపొంది విశాల జీవితపు లోతుపాతులను సూక్ష్మాతి సూక్ష్మాంశములను సైతము సహజ సిద్ధముగా చిత్రించగల్గుచున్నది.

ఈ అర్థశతాబ్దకాలంలోనే హిందీ కథాసాహిత్యము యింతగా అభివృద్ధిగాంచడం భావ్యాభివృద్ధికి ఆశాజనకమైన ప్రోత్సాహకరముగా యున్నది. హిందీకథా సాహిత్యాభివృద్ధిని సూక్ష్మదృష్టితో పరిశీలించి చూచినయెడల విశ్వ కథాసాహిత్యక్షేత్రమున అద్యతనభావిలో ఉన్నతస్థానము లభించవచ్చునని మనము తలంచవచ్చును.

---

మనిషి ఒక నిచ్చెనవంటి వాడనుకుందాం: భూమిమీద నిలబెడితే నిచ్చెన రెండవకొస దేవలోకాన్ని అంటుతుంది. మనిషి ప్రవర్తన, చర్యలు, మాటలు, వీటన్నిటి ప్రభావమూ ఊర్ధ్వలోకాలపై ప్రసరించితీరుతుంది. దేవతలకు సైతం మానవుడికి వలెనే సుగుణాలతోపాటు దౌర్బల్యాలుకూడా ఉన్నాయని పురాణ వాక్కు. అంటే అర్థం ఏమిటి? చెడిపోయే శక్తి లేకపోవడం దేవతల సుగుణం; అలాగే-అభివృద్ధి పొందే అవకాశం లేకపోవడం వాళ్ళ దౌర్భాగ్యం. మనిషి అభివృద్ధి పొందగలడు: అది అతని సద్గుణం; అలాగే మనిషికి చెడిపోయే శక్తి ఉంది: అది అతని దౌర్బల్యం. అంచేత మనిషి నిరంతర కృషివల్ల నిచ్చెన మెట్లు ఒక్కటొక్కటే ఎక్కి దైవత్వం అందుకోగలడు ప్రయత్నిస్తే. కావలసిందల్లా సంకల్పం. బలీయమైన ప్రతికూల శక్తులు మనిషిని చుట్టుపెడితే, వాటిని వదిలించుకుని, బలాన్ని కూడగట్టుకుని "స్వేచ్ఛ" సంపాదించినవాడే నిచ్చెన ఎక్కి పైపైకి పోగలడు. —మార్టిన్ బ్యూబర్.